సాక్షి జయశంకర్ భూపాలపల్లి

మంగళవారం । 11 । ఏప్రిల్ । 2023



విద్యార్థులకు వార్షిక పరీక్షలు

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పరిధిలోని 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు రేపటి నుంచి వార్షిక పరీక్షలు నిర్వహించనున్నారు. - 8లో



అటవీ మాంసం విక్రయదారుల అరెస్ట్

అటవీ మాంసం క్రయవిక్రయదారులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.0°/24.0°

జిల్లాలో ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు వేడిగాలులు వీస్తాయి. కాస్త ఉక్కపోతగా ఉంటుంది.



న్యూస్‌రీల్

ఆలయ వేళల్లో మార్పులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో వేసవి దృష్ట్యా ఆలయ వేళల్లో మార్పులు చేసినట్లు ఈఓ మహేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం నుంచి ఎండాకాలం పూర్తయ్యే వరకు మధ్యాహ్నం ఒంటి గంటకు ద్వార బంధనం చేసి తిరిగి సాయంత్రం 4గంటలకు ద్వారాలు తెరుస్తారు. మామూలు సమయాల్లో 1.30గంటలకు ద్వార బంధనం చేసి సాయంత్రం 4గంటలకు తెరుస్తారనే విషయం తెలిసిందే. కాగా, భక్తులు ఆలయ వేలల్లో మార్పులు గమనించగలరని ఆయన కోరారు.

డీఈఓ ఆకస్మిక తనిఖీ

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలకేంద్రంలోని పదవ తరగతి వార్షిక పరీక్షలను సోమవారం డీఈఓ రాంకుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు మాల్ ప్రాక్టీస్ చేయరాదని, ఇన్విజిలేటర్లు పకడ్బందీగా పరీక్షలను నిర్వహించాలని సూచించారు.

నలుగురు విద్యార్థులు గైర్హాజరు

భూపాలపల్లి అర్బన్: పదవ తరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా సోమవారం నిర్వహించిన సామాన్యశాస్త్రం పరీక్షకు నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాంకుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 20పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 3,651 మంది విద్యార్థులకు గాను 3,647మంది హాజరైనట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు చెప్పారు.

కారుణ్య నియామకాలను వేగవంతం చేయాలి



భూపాలపల్లి అర్బన్: ఏరియాలో కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేయాలని డీజీఎం, ఏరియా ప్రతినిధి తుకారాం తెలిపారు. జీఎం కార్యాలయంలో సోమవారం ఏరియాలోని అన్ని గనుల సంక్షేమ అధికారులు, విభాగాల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఏరియాలో పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు, టర్మినల్ బెనిఫిట్, కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేసే ప్రక్రియ, రామప్ప కాలనీలో నూతనంగా నిర్మించిన క్వార్టర్ల కేటాయింపు ప్రక్రియపై చర్చించారు. అర్హులైన వారందరికీ ప్రమోషన్లు కల్పించి కారుణ్య నియామక పత్రాలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఎం శివకేశవరావు, సీనియర్ పీఓ క్రాంతికుమార్, సూపరింటెండెంట్ సంజీవరావు, అధికారులు పాల్గొన్నారు.

నేడు మహాత్మా జ్యోతిబాపూలే జయంతి

భూపాలపల్లి రూరల్: మహాత్మా జ్యోతిబాపూలే 197వ జయంతి వేడుకలను నేడు 11వతేదీ (మంగళవారం) జిల్లాకేంద్రంలోని ప్రగతి భవన్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి టి.శైలజ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేడుకలకు జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, కుల సంఘాల ప్రతినిధులు, జిల్లా అధికారులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కలెక్టర్‌కు వినతి



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం మద్దులపల్లి శివారులోని బల్జాపూర్ సమీపంలోని కుంట్లం-2 ఇసుక క్వారీ కాంట్రాక్టర్లు కౌలుకు భూమి లీజుకు తీసుకొని డబ్బులివ్వడం లేదని కలెక్టర్ భవేష్‌మిశ్రాను రైతులు సోమవారం వినతిప్రతం అందజేశారు. రైతులు తమ గోడును కలెక్టర్‌కు వివరించి డబ్బులు త్వరగా ఇప్పించాలని వేడుకున్నారు. కలెక్టర్ స్పందించి రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

విత్తు భారమే..



పెరిగిన పత్తి విత్తనాల ధర

- జిల్లా రైతులపై అదనపు భారం



భూపాలపల్లి రూరల్: ప్రతికూల వాతావరణ పరిస్థితులతో దిగుబడి లేక ఇబ్బంది పడుతున్న పత్తి రైతులపై విత్తనాల ధర పెరుగుదల రూపంలో ఆర్థికభారం మరింతగా పడనుంది. సీజన్ ప్రారంభంలో కోటిఆశలతో సాగుచేస్తున్న పత్తిరైతుపై గడిచిన కొన్ని సంవత్సరాలుగా ప్రకృతి తన ప్రతాపాన్ని చూపుతుండడంతో అప్పులఊబిలో కూరుకుపోతున్నారు. ప్రతియేటా సాగులో నష్టాలే ఎదురవుతున్నా.. ఈ సారైనా దేవుడు కరుణించకపోతాడా అనుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఈ సారి సీజన్ ప్రారంభానికి ముందే కేంద్ర ప్రభుత్వం పత్తి విత్తనాల ధరను పెంచుతూ నిర్ణయం తీసుకోవడంతో రైతులపై అదనపు భారం పడనుంది.

జిల్లాలో 95,654 ఎకరాల్లో పత్తిసాగు..

జిల్లాలోని 11 మండలాల పరిధిలోని రైతులు పత్తినే ప్రధాన పంటగా సాగుచేస్తున్నారు. జిల్లాలో ఆశించిన స్థాయిలో సాగునీటి వనరులు ఉండటంతోపాటు జిల్లాలో అధికంగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఎక్కువగా వర్షాధార పంటల సాగుకు మొగ్గుచూపుతున్నారు. ఎక్కువగా పత్తి సాగు చేస్తున్నారు. గత వానాకాలం సీజల్‌లో జిల్లా వ్యాప్తంగా 95,654ఎకరాల్లో పత్తి సాగు చేపట్టారు. సీజన్ ప్రారంభం నుంచే కురిసిన అధిక వర్షాలతో మొలకదశలోనే వందలాది ఎకరాల్లో పత్తిపంట దెబ్బతింది. పంటలను కాపాడుకునేందుకు రైతులు ఎరువులు, రసాయనక మందుల పిచికారీ, కలుపు నివారణ పనులతో పెట్టుబడులు బాగా పెరిగాయి. పత్తి కొనుగోళ్ల సీజన్ ప్రారంభంలో క్వింటాకు రూ.8వేలు పలికిన ధర క్రమంగా తగ్గుతూ రావటంతో రైతులు పత్తి ధర విషయంలో తీవ్రంగా నష్టపోయారు. అయినప్పటికీ కోటి ఆశలతో పత్తిసాగు కోసం రైతులు సిద్ధం అవుతుండగా ప్రభుత్వం పత్తి విత్తనాల ధర పెంచడంతో సీజన్‌కు ముందే రైతులకు ఎదురు దెబ్బ తగిలింది.

అదనపు భారం..

కేంద్ర ప్రభుత్వం పత్తి విత్తనాల ప్యాకెట్ ధరను పెంచడంతో జిల్లా రైతులపై అదనపు భారం పడనుంది. జిల్లాలో రైతులు సాధారణ పత్తి సాగులో 450 గ్రాముల బరువు కలిగిన పత్తి విత్తనాల ప్యాకెట్‌ను ఎకరానికి రెండు ప్యాకెట్ల చొప్పున విత్తుతారు. ఈ లెక్కన జిల్లాలో ప్రతీ ఈ సంవత్సరం సుమారు 1,91,300పైగా విత్తనాల ప్యాకెట్లు అవసరం ఉంటాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం ఒక్కో ప్యాకెట్‌పై రూ.43 పెంచడంతో గతంలో రూ.810 ఉన్న ప్యాకెట్ ధర ప్రస్తుతం రూ. 853కు చేరింది. దీంతో జిల్లాలో పత్తి సాగు చేసే రైతులపై సుమారుగా రూ.80లక్షలకు పైగా అదనపు ఆర్థిక భారం పడనుంది. ఈ ఏడాది అరకొరగా వచ్చిన దిగుబడికి గిట్టుబాటు ధర సైతం దక్కక పోవడంతో వందలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంటలకు పెట్టిన పెట్టుబడులు రాక అప్పులు మీద పడ్డాయి.

మద్దతు ధర ప్రకటించాలి..



పెరుగుతున్న ఎరువుల ధరలు, విత్తనాల ధరలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వాలు పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి. అప్పుడే రైతులకు న్యాయం జరుగుతుంది.

- మునిగాల స్వామి, పోతుగల్, టేకుమట్ల

పెంచిన ధరలు తగ్గించాలి..



కేంద్ర ప్రభుత్వం పెంచిన పత్తి విత్తనాల ధరలను వెంటనే తగ్గించాలి. గత సంవత్సరం అధిక వర్షాలతో పత్తి రైతులకు తీవ్రంగా నష్ట జరిగింది. సరైనా దిగుబడి రాకపోవడంతో అప్పులు మీదపడ్డాయి. మార్కెట్‌లో కూడా ధరలు తగ్గించడంతో తక్కువ ధరకే అమ్ముకున్న పరిస్థితి ఉంది. ఇలాంటి సమయంలో విత్తనాల ధరలు పెంచడం సబబుకాదు.

- సుంకరి రామచంద్రయ్య

సమస్యలకు పరిష్కారం చూపాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా

భూపాలపల్లి: ప్రజావాణి సమస్యలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పరిష్కారానికి కృషిచేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సమస్యలకు సంబంధించిన 22దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ ఆశాలత, సీపీఓ కె.శామ్యూల్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

పనులు కట్టుదిట్టంగా చేపట్టాలి

గ్రామ పంచాయతీలలో చేపట్టే అభివృద్ధి పనులలో నిబంధనలను కట్టుదిట్టంగా పాటించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. గ్రామపంచాయతీలలో జరుగుతున్న అవకతవకల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముందస్తు చర్యలపై మండల పంచాయతీ అధికారులతో సోమవారం కలెక్టర్ తన చాంబర్లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల్లో చేపట్టే ప్రతీ అభివృద్ధి పనికి సంబంధించి నిర్దేశించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రతీ అభివృద్ధి పనికి సంబంధించి గ్రామ సభలో తీర్మానం తీసుకోవాలని చెప్పారు. జిల్లాలోని కొన్ని గ్రామ పంచాయతీల పరిధిలో అక్రమ నిర్మాణాలు, చెల్లింపులు జరుగుతున్నట్లు సమాచారం అందుతుందని తెలిపారు. సంబంధిత ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శిలు ఈ అంశాలపై అప్రమత్తంగా ఉంటూ వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ టీఎస్ దివాకర, డీపీఓ ఆశాలత, ఎంపీఓలు పాల్గొన్నారు.

8బస్సుల్లో 400మంది తరలింపు

హైదరాబాద్‌లో నిర్మించిన 125 అడుగుల ఎత్తయిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు జిల్లా నుంచి ప్రజలు సకాలంలో చేరే విధంగా పకడ్బందీ కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా ఆదేశించారు. ఏప్రిల్ 14న రాష్ట్ర రాజధానిలో ఆవిష్కరించనున్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు జిల్లా నుంచి ప్రజల తరలింపు కోసం చేయాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సోమవారం తన చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా నుంచి 8బస్సుల్లో 400మందిని తరలించే విధంగా ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ మండల హెడ్ క్వార్టర్ నుంచి బస్సుల ద్వారా ప్రజలను తరలించాలని చెప్పారు. భూపాలపల్లి నియోజకవర్గంలో ఐదు బస్సులు ద్వారా, మంథని నియోజకవర్గంలోని మూడు బస్సుల ద్వారా మొత్తం 400మందిని తరలించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ టీఎస్ దివాకర, డీఆర్‌డీఓ పురుషోత్తం, జెడ్పీ సీఈఓ రఘువరణ్, డీపీఓ ఆశాలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచొద్దు

- ఎస్పీ సురేందర్‌రెడ్డి



ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న ఎస్పీ

భూపాలపల్లి: ప్రజల ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా వేగంగా పరిష్కరించాలని ఎస్పీ జె.సురేందర్‌రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజాదివస్ కార్యక్రమంలో భాగంగా 14మంది బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తేనే ప్రజల మన్ననలు పొందుతారన్నారు. ప్రజలకు న్యాయం అందించే విషయంలో జిల్లా పోలీసులు పటిష్టంగా పనిచేయాలని సూచించారు. జన జీవనానికి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ ఆదేశించారు.

రిటైర్డ్ ఉద్యోగుల నిరసన దీక్ష



కలెక్టరేట్ ఎదుట దీక్ష చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

భూపాలపల్లి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీఆర్ మోహన్ మాట్లాడుతూ.. ఈహెచ్‌ఎస్ అన్ని ఆస్పత్రుల్లో పనిచేసే విధంగా చూడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, హెచ్‌ఆర్‌ఏ బకాయిలు చెల్లించాలని కోరారు. వైద్య బిల్లులు చెల్లించాలని, 65 సంవత్సరాల నుంచి అదనపు పెన్షన్ పెంచాలని, ఆదాయపన్ను నుంచి మినహాయింపు కల్పించాలని, ప్రతి నెల 1వ తేదీ పెన్షన్లు చెల్లించాలని కోరారు. నూతన పీఆర్‌సీ అమలు చేయాలని, ప్రతి ఏడాది డిసెంబర్ 17న అఖిల భారత పెన్షనర్స్ డే నిర్వహించాలని కోరారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ భవేష్‌మిశ్రాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్ట రామచంద్రమూర్తి, అయిలయ్య, నాయకులు ధరమ్‌సింగ్, రాజమౌళి, నారాయణరెడ్డి, రాజయ్య, రామ్‌నాయక్, పోచయ్య పాల్గొన్నారు.

ఏఆర్ ఏఎస్పీగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



ఎస్పీ సురేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాస్

భూపాలపల్లి: ఏఆర్(ఆర్మ్‌డ్ రిజర్వ్) అడిషనల్ ఎస్పీగా వి.శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 1992లో ఆర్ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌గా, ఏఆర్ డీఎస్పీగా పదోన్నతి పొంది ప్రస్తుతం నిజామాబాద్ జిల్లాలో పని చేస్తున్నారు. ఇటీవల పోలీసు ఉన్నతాధికారులు ఆయనకు ఏఎస్పీకి పదోన్నతి కల్పిస్తూ భూపాలపల్లి జిల్లాకు బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన ఏఆర్ ఎస్పీగా సోమవారం బాధ్యతలు స్వీకరించి మర్యాదపూర్వకంగా ఎస్పీ జె.సురేందర్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

విద్యార్థి వికాసం జరగాలి

- సమస్యలకు పరిష్కారం వెతకాలి
- కేయూ వీసీ తాటికొండ రమేశ్



మాట్లాడుతున్న వీసీ రమేశ్, పక్కన రిజిస్ట్రార్


కేయూ క్యాంపస్: విద్యార్థి వికాసం జరగాలని సమస్యలకు పరిష్కారం వెతకాలని కేయూ వీసీ తాటికొండ రమేశ్ అన్నారు. సోమవారం కేయూలోని విద్యా కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించిన వర్సిటీ పరిధి బీఈడీ కళాశాలల ప్రిన్సిపాళ్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అడ్మినిస్ట్రేషన్ పరంగా ఉన్న సమస్యల్ని తన దృష్టికి తీసుకురావాలన్నారు. కేయూ రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థ బలహీన పడకూడదన్నారు. విద్యా విభాగం డీన్, అడ్జెంట్ ఆచార్యులు ఎస్.రాంనాథ్‌కిషన్ మాట్లాడుతూ.. మారుతున్న పాఠ్యప్రణాళికకు అనుగుణంగా విద్యాబోధన ఉండాలని కోరారు. కేయూ విద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రణధీర్ రెడ్డి అధ్యక్షత వహించిన ఈసమావేశంలో వివిధ బీఈడీ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

ఉత్సవాలకు మెగాస్టార్ చిరంజీవి, మంత్రి కేటీఆర్

ప్రపంచ వారసత్వ వేడుకలకు హీరో మెగాస్టార్ చిరంజీవి, మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు సమాచారం. కేంద్ర, రాష్ట్ర పురావస్తుశాఖ అధికారులు ఇప్పటికే వారిని ఆహ్వానించినట్లు ఆయా శాఖలకు చెందిన అధికారులు పేర్కొన్నారు. వారితో పాటు మంత్రులు శ్రీనివాస్ గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్‌లు సైతం హాజరుకానున్నారు.

రామప్పలో తొలిసారిగా..





వారసత్వ ఉత్సవాల లోగో

18న ప్రపంచ వారసత్వ వేడుకలు

- శిల్పం వర్ణం కృష్ణం పేరుతో ఘనంగా ఉత్సవాలు
- సరస్సు కట్టపై ఫుడ్ ఫెస్టివల్
- 300 మంది కళాకారులతో సాంస్కృతిక సంబురాలు

వెంకటాపురం(ఎం): ప్రపంచ ప్రసిద్ధి చెందిన రామప్ప దేవాలయంలో తొలిసారిగా ప్రపంచ వారసత్వ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం ఈ నెల 18న నిర్వహించనుంది. 'శిల్పం వర్ణం కృష్ణం సెలబ్రేటింగ్ ది హెరిటేజ్ రామప్ప' అనే పేరుతో ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 20 వేల మంది హాజరయ్యే ఈ వేడుకలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. 18న ఉదయం నుంచి సాయంత్రం వరకు రామప్ప సరస్సు కట్టపై తెలంగాణ చుట్టు పక్కల ఉన్న ఆహార విక్రేతలు, చేతివృత్తుల వారు, ఎంటర్‌ప్రైజెస్ వారిచే ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అంగరంగవైభవంగా జరిగే ప్రపంచ వారసత్వ వేడుకలకు ప్రజలు, పర్యాటకులు అధికసంఖ్యలో తరలిరానున్నారు.

300మందికి పైగా కళాకారుల రాక

18న సాయంత్రం 5 నుంచి 10గంటల వరకు రామప్ప గార్డెన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. సుమారు 300 మందికి పైగా కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఇందులో సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్, డ్రమ్స్ కళాకారుడు శివమణి, గాయకుడు కార్తీక్, ఫ్లూటిస్ట్ నవీన్, శ్రవ్య మానస సుమధుర డ్యాన్స్ అకాడమీ కళాకారుల బృందం భిన్నత్వంలో ఏకత్వాన్ని వర్ణించే భారతీయ నృత్య రూపాల సమ్మేళనాన్ని ప్రదర్శించనుంది. బెంగుళూరుకు చెందిన కళాకారుడు సూర్య ఎన్.రావు శివునికి అంకితం చేసిన 'రావణ' రూపకం ప్రదర్శన ప్రజలను అలరించనుంది. అదేవిధంగా పేరిణి నృత్య కళాకారుడు రాజ్‌కుమార్ తన బృందంతో తెలంగాణ ప్రాంత సాంప్రదాయ నృత్యంతో అద్భుతమైన పేరిణి నాట్యాన్ని ప్రదర్శించనున్నారు. హైదారాబాద్‌కు చెందిన అరభి ఇనిస్టిట్యూటివ్ కళాకారులు సంగీత నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నారు. అదేవిధంగా రామప్ప దేవాలయం విశిష్టత, చరిత్ర గురించి 45 నిమిషాల పాటు లేజర్‌షోను ప్రదర్శించనున్నారు.

ప్రతీ ఏడాది ప్రపంచ వారసత్వ దినోత్సవం

ప్రపంచ వారసత్వ హోదా రామప్ప ఆలయానికి ఇస్తున్నట్లుగా 2021 జూలై 25న యునెస్కో ప్రకటించింది. 1213లో కాకతీయులు నిర్మించిన రామప్ప ఆలయానికి వారసత్వ హోదా రావడంతో తెలుగు రాష్ట్రాల ప్రజలు గర్వపడ్డారు. దేశంలో 39వ హెరిటేజ్ సైట్‌గా, తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా వారసత్వ హోదా దక్కిన కట్టడం రామప్ప ఆలయం. ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని ప్రతీ సంవత్సరం ఏప్రిల్ 18న నిర్వహిస్తారు. 1982లో ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆన్ మాన్యుమెంట్స్ అండ్ సైట్స్ (ఐకోమాస్) వారసత్వ దినోత్సవాన్ని స్థాపించగా 1983లో ఐక్యరాజ్యసమితి విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక సంస్థ (యునెస్కో)చే ఆమోదించబడింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సాంస్కృతిక, వారసత్వ ప్రదేశాలు, స్మారక చిహ్నాల ప్రాముఖ్యతపై అవగాహన పెంచడంతో పాటు వాటి సంరక్షణ, రక్షణను ప్రోత్సహించడమే వారసత్వ దినోత్సవం ప్రత్యేకత. ఈ నెల 18న రామప్పలో అత్యంత వైభవంగా వేడుకలు నిర్వహించనున్నారు.

ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

రామప్ప దేవాలయంలో ప్రపంచ వారసత్వ ఉత్సవాల ఏర్పాట్లను సోమవారం కలెక్టరేట్ ఏఓ విజయ భాస్కర్, డీపీఓ వెంకయ్య, ఉమ్మడి జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, మండల స్పెషల్ ఆఫీసర్ పిల్లి శ్రీపతి, తహసీల్దార్ మంజుల పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఈవెంట్ ఆర్గనైజర్లతో కలిసి సభా వేదిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఆలయంలో నిర్వహించాలా.. గార్డెన్లో నిర్వహిస్తే బాగుంటుందా అనే దానిపై చర్చించారు. ఉత్సవాలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున నిర్వహణ స్థలాన్ని ఎంపిక చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. వారి వెంట టూరిజం, రెవెన్యూ, తదితర శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

డిగ్రీ ఫలితాలు విడుదల

పింగిళి కళాశాలలో 59.61 శాతం ఉత్తీర్ణత

విద్యారణ్యపురి: హనుమకొండలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్) బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షల ఫలితాల్ని సోమవారం ఆ కళాశాలలో కేయూ పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.చంద్రమౌళి, విడుదల చేశారు. మొత్తం 463 మంది పరీక్షలకు హాజరవ్వగా.. అందులో 276 మంది(59.61 శాతం) మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించారు. ఈఫలితాల విడుదలలో పింగిళి కళాశాల పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రామకృష్ణారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు రేణుక, శిరీష, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, అకాడమిక్ కో-ఆర్డినేటర్ పార్వతి, వివిధ విభాగాల అధిపతులు రాజేశ్వరి, గంప రజిత, మాధవి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భద్రత పెంపు

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా సికింద్రాబాద్–విశాఖపట్నం వరకు ప్రయాణించే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఇటీవల జరిగిన రాళ్లదాడి నేపథ్యంలో రైల్వేపోలీస్ ఉన్నతాధికారుల ఆదేశానుసారం రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) భద్రత పెంచినట్లు కాజీపేట ఆర్‌పీఎఫ్ సీఐ సంజీవరావు సోమవారం తెలిపారు. కాజీపేట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీస్‌స్టేషన్ పరిధి సెక్షన్లలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణిస్తున్న సమయంలో పోలీసుల ప్రత్యేక నిఘా, భద్రతను పెంచినట్లు తెలిపారు. కాజీపేట జంక్షన్ పరిధిలోని దర్గా రైల్వే లెవెల్‌క్రాసింగ్ గేట్, పెండ్యాల్, నష్కల్ రైల్వే గేట్ల వద్ద పోలీసుల భద్రత పెంచడంతో పాటు గేట్లలో నుంచి రాకపోకలు చేసే ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. రైల్వే ఆస్తుల ధ్వంసానికి పాల్పడిన వారిపై రైల్వే చట్టం ప్రకారం కేసులు తీవ్రంగా ఉంటాయని ఆయన తెలిపారు.

వేసవి శిక్షణ శిబిరాన్ని వినియోగించుకోవాలి

వరంగల్ స్పోర్ట్స్: వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు మే1 నుంచి 31 వరకు నిర్వహించనున్నట్లు, శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అధికారి గుగులోత్ అశోక్‌కుమార్ సూచించారు. వివిధ క్రీడాంశాల్లో నెలరోజుల పాటు అందించే శిక్షణ కోసం ఈనెల 5 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగో తరగతి నుంచి ఇంటర్ చదివే పట్టణ ప్రాంత విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఇతర పూర్తి వివరాలకు హనుమకొండ ఇండోర్ స్టేడియంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

70 ట్రాక్టర్ల ఇసుక సీజ్

ఏటూరునాగారం : మండలంలోని రామన్నగూడెం గోదావరి నదిలో అక్రమంగా తరలించి డంప్‌చేసిన 70 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ సంజీవ తెలిపారు. సోమవారం రామన్నగూడెం కరకట్ట వద్ద అక్రమంగా డంప్ చేసిన ఇసుకను ఆయన పరిశీలించారు. గోదావరిలో ఇసుక అనుమతి లేకుండా పోయడంతో దాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నామన్నారు. కాంట్రాక్టర్ చిప్ప అశోక్ ఇసుకకు ఏదైనా ప్రభుత్వ రుసుము చెల్లించినట్లు చూపితే కాంట్రాక్టర్‌కు అప్పగిస్తామని లేకుంటే బహిరంగ వేలం వేస్తామని తెలిపారు. పీఆర్ డీఈఈ, రెవెన్యూ నుంచి ఎలాంటి అనుమతి పొందలేదు. అంతే కాకుండా రాంనగర్ గోదావరి నుంచి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

విద్యార్థులకు వార్షిక పరీక్షలు

- పాఠశాలల్లో రేపటి నుంచి 20వ తేదీ వరకు
- ఎంఆర్‌సీలో ప్రశ్నపత్రాలు



విద్యారణ్యపురి: ఉమ్మడి జిల్లాలో అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు ఈనెల 12 నుంచి 20 వరకు నిర్వహించనున్నారు. పరీక్షల నిర్వహణపై టైంటేబుల్ షెడ్యూల్‌ను డీఈఓ ఎండీ.అబ్దుల్‌హై, డీసీఈబీ సెక్రటరీ రాజన్న విడుదల చేశారు. 12న 1నుంచి 7వ తరగతుల విద్యార్థులకు ప్రథమ భాష (తెలుగు, ఉర్దూ తదితర) పరీక్షలు నిర్వహిస్తారు. 8, 9వ తరగతి విద్యార్థులకు గణితం పరీక్షలు నిర్వహిస్తారు. 13న 1 నుంచి 5 తరగతులకు ఇంగ్లీష్, 6, 7 తరగతులకు ద్వితీయ భాష (హిందీ ,తెలుగు), 8, 9 తరగతులకు భౌతిక శాస్త్రం, 15న 1 నుంచి 5 తరగతులకు గణితం, 6,7 తరగతులకు తృతీయ భాష(ఇంగ్లీష్), 8, 9 తరగతులకు సాంఘికశాస్త్రం, 17న 1 నుంచి 5 తరగతులకు పరిసరాల విజ్ఞానం 6, 7 తరగతులకు సాంఘీక శాస్త్రం, 8, 9 తరగతులకు ప్రథమ భాష (తెలుగు,ఉర్దూ), 19న 6,7 తరగతులకు గణితం, 8 ,9 తరగతులకు ద్వితీయ భాష (హిందీ,తెలుగు), 20న 6,7 తరగతులకు సామాన్యశాస్త్రం, 8, 9 తరగతులకు తృతీయ భాష (ఇంగ్లీష్) పరీక్షలు నిర్వహించాలని వారు హెచ్‌ఎంలను ఆదేశించారు.

పరీక్షల సమయం ఇలా..

1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులు ఆయాతేదీల్లో ఉదయం 9–30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 6, 7, 8 తరగతులకు ఉదయం 9–30 నుంచి మధ్యాహ్నం 12–15 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. 9వతరగతికి ఉదయం 9–30 నుంచి మధ్యాహ్నం 12–30 గంటల వరకు పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే 8వ తరగతి జీవశాస్త్రం మాత్రం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.45 గంటలవరకు నిర్వహిస్తారు. అలాగే 9వ తరగతి భౌతికశాస్త్రం పేపర్ 1 ఉదయం 9–30 నుంచి 11 గంటల వరకు, పేపర్–2 జీవశాస్త్రం ఉదయం 11–20గంటల నుంచి మధ్యాహ్నం 12–50 గంటల వరకు నిర్వహిస్తారు.

మండల కేంద్రాల్లోని ఎంఆర్‌సీలో ప్రశ్నపత్రాలు

అన్ని మండల కేంద్రాల్లోని ఎంఆర్‌సీ ఎంఈఓల పర్యవేక్షణలో ప్రశ్నపత్రాల బండిల్స్‌ను పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్యను బట్టి బండిల్స్‌ను అందుబాటులో ఉంచారు. 1 నుంచి 9వ తరగతి వరకు ప్రశ్నపత్రాలను ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు తీసుకెళ్లాల్సి ఉంటుంది. 6 నుంచి 9వ తరగతి వరకు మాత్రమే ప్రశ్నపత్రాలను ప్రైవేటు పాఠశాలల యాజామాన్యాలు తీసుకెళ్లాల్సి ఉంటుందన్నారు. అయితే ప్రైవేటు పాఠశాలల యాజ మన్యాలు ఏ రోజుకు సంబంధించిన సబ్జెక్టుల ప్రశ్నపత్రాలు అదే రోజు ఉదయం తీసుకెళ్లాల్సి ఉంటుంది. హనుమకొండలో నాలుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోనూ (కీ సెంటర్లుగా) ప్రశ్నపత్రాలను భద్రపర్చామని, నగరంలోని ప్రైవేటు యజ మాన్యాలు అక్కడి నుంచే తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఏమైనా సందేహాలుంటే డీసీఈబీ సెక్రటరీని సంప్రదించాలన్నారు. ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలను సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించాలి. 21న జవాబుపత్రాల మూల్యాంకనం ఫలితాలను వెల్లడించాల్సి ఉంటుంది. ఫలితాలను క్యూములేటివ్ రికార్డులో నమోదు చేయాలి. 24న పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించి విద్యార్థుల పురోగతి క్యూములేటివ్ రికార్డులను అందించి వాటిపై తల్లిదండ్రుల సంతకం చేయించి తరగతి ఉపాధ్యాయులకు అప్పగించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

పరీక్షలు రాయబోతున్న విద్యార్థుల సంఖ్య ఇలా

జిల్లా	1-5	6-9
హనుమకొండ	27,638	46, 204
వరంగల్	22,466	43,100
మహబూబాబాద్	46,342	41,197
జేఎస్ భూపాలపల్లి	16,299	24,775
ములుగు	11,176	27,778

ఇంజక్షన్ వికటించి విద్యార్థి మృతి

- మృతదేహంతో ఆస్పత్రి ఎదుట ఆందోళన

హసన్‌పర్తి: ఇంజక్షన్ ఓ విద్యార్థి ప్రాణం తీసింది. కడుపునొప్పితో బాధపడుతున్న విద్యార్థికి ఒకేసారి మూడు ఇంజక్షన్లు ఇవ్వడంతో అది వికటించి మృతి చెందినట్లు బాధితుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. సదరు వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదులో పేర్కొన్నారు. హసన్‌పర్తికి చెందిన మీసరకొండ ప్రియా–సత్యంకు కూతురు, కుమారుడు అవినాష్(11) ఉన్నారు. మామునూర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలో అవినాష్ 6వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం ఔటింగ్ ఉండడంతో సత్యం పాఠశాలకు వెళ్లాడు. అక్కడ కుమారుడితో కొంతసేపు కాలక్షేపం చేశాడు. మధ్యాహ్నం అవినాష్‌ను పాఠశాలలో వదిలి ఇంటికి తిరిగి వచ్చాడు. ఇదిలా ఉండగా, సాయంత్రం అవినాష్ కడుపునొప్పితో బాధపడుతున్నట్లు పాఠశాల నుంచి తల్లిదండ్రులకు ఫోన్ వచ్చింది. దీంతో సత్యం హుటాహుటిన అక్కడికి చేరుకున్నాడు. కుమారుడిని తీసుకుని ఇంటికి వచ్చాడు. అనంతరం హసన్‌పర్తిలోని డాక్టర్ శంకర్ వైద్యుడి వద్దకు తీసుకెళ్లాడు. పరీక్షలు నిర్వహించిన డాక్టర్ మూడు ఇంజక్షన్లు ఇచ్చినట్లు సత్యం చెప్పాడు. ఒకేసారి పరిస్థితి విషమించడంతో ఎంజీఎంకు రెఫర్ చేశాడు. ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే అవినాష్ మృతి చెందాడు.



మృతదేహంతో ధర్నా చేస్తున్న బంధువులు

మృతదేహంతో ధర్నా, రాస్తారోకో...

ఇంజక్షన్ వికటించడం వల్ల అవినాష్ మృతి చెందాడని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. తొలుత ఆస్పత్రి ఎదుట మృతదేహంతో గంటపాటు ధర్నా చేశారు. అనంతరం హన్మకొండ–కరీంనగర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మృతికి కారకుడైన వైద్యుడిని శిక్షించాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై విజయ్‌కుమార్ సంఘటన స్థలాన్ని చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఆందోళనకారులను శాంతిపజేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు డాక్టర్ శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ రావుల నరేందర్ తెలిపారు.

నా కొడుకును చంపారు..

కడుపునొప్పి కోసం ఆస్పత్రికి తీసుకెళ్తే నా కుమారుడు అవినాష్‌ను డాక్టర్ సముద్రాల శంకర్ చంపాడని మృతుడి తండ్రి సత్యం ఆరోపించాడు. తమకు నాయం చేయాలని కోరారు.

– సత్యం, మృతుడి తండ్రి

ఆనందంగా గడిపాడు

మీసరకొండ అవినాష్ తెలివి గల విద్యార్థి. ఆదివారం ఔటింగ్‌ను పురస్కరించుకుని తన పేరెంట్స్‌తో ఆనందంగా గడిపాడు. పేరెంట్స్ బిర్యాని తీసుకొచ్చి తినిపించారు. పేరెంట్స్ వెళ్లిన గంటకే అనారోగ్యానికి గురయ్యాడు. తల్లిదండ్రులకు సమాచారం ఇస్తే వారు తీసుకెళ్లారని పాఠశాల స్పెషల్ ఆఫీసర్ లక్ష్మయ్య తెలిపారు.

– లక్ష్మయ్య, స్పెషల్ ఆఫీసర్

రైస్‌మిల్లులో భారీ అగ్నిప్రమాదం

- కాలిబూడిదైన బియ్యం నిల్వలు
- రూ.10 లక్షల మేర ఆస్తినష్టం

ఖిలావరంగల్ : వరంగల్ కరీమాబాద్ రోడ్డులోని రామ్‌లక్ష్మణ్ గార్డెన్స్ ఎదురుగా ఓం నమోభగవతే వాసు దేవాయే విశ్వేశ్వర రైస్‌మిల్లులో సోమవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ధాన్యం, బియ్యం నిల్వలు కాలి బూడిదయ్యాయి. సకాలంలో వరంగల్, గొర్రెకుంట, హనుమకొండకు చెందిన మూడు ఫైర్‌ఇంజన్లు రాకతో ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు ఫైర్ అధికారులు, సిబ్బంది శ్రమించడంతో మంటలు పూర్తి స్థాయిలో అదుపులోకి వచ్చాయి. సుమారు రూ.10 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందని ఫైర్, పోలీస్, రెవెన్యూ అధికారులు అంచనా వేస్తున్నారు. ఘటన స్థలానికి మండల రెవెన్యూ, ఫైర్ అధికారులు, ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్, స్థానిక ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. రైస్‌మిల్లు యజమాని ఇరుకుల రమేష్ నుంచి ఘటనకు గల కారణాలను సేకరించే ప్రయత్నం చేశారు.



మంటలను అదుపులోకి తెస్తున్న ఫైర్ సిబ్బంది

‘చీకటి’ వ్యాపారంపై కలెక్టర్ ఆగ్రహం

సాక్షి ఎఫెక్ట్..

హసన్‌పర్తి: మండలంలోని అన్నాసాగరం కేంద్రంగా సాగుతున్న మొరం దందాపై హనుమకొండ జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘చీకటి వ్యాపారం’ అనే కథనం ‘సాక్షి’లో సోమవారం ప్రచురితమైంది. ఈ విషయమై కలెక్టర్ సిక్తా పట్నాయక్ సీరియస్‌గా పరిగణించినట్లు తెలిసింది. ఎస్సారెస్పీ ప్రధాన కాల్వ నుంచి ఎన్నాళ్ల నుంచి మొరం దందా సాగుతోందంటూ నీటి పారుదల, రెవెన్యూ, పోలీస్‌శాఖలు ఏమైనా కేసులు నమోదు చేశారా? అని ఆరా తీస్తున్నట్లు సమాచారం.విలువైన భూములను తోడుతుంటే ఏం చేస్తున్నారని ఆరా తీసినట్లు తెలిసింది.

‘అటవీ’ మాంసం క్రయవిక్రయదారుల అరెస్టు

ములుగు రూరల్: అటవీ జంతువుల మాంసం క్రయవిక్రయదారులను అటవీశాఖ అధికారులు అరెస్టు చేశారు. సోమవారం అటవీ రేంజ్ కార్యాలయంలో రేంజర్ డోలి శంకర్ నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. ఆయన మాట్లాడుతూ పత్తిపల్లిలో అటవీ జంతువుల మాంసం ఉందన్న సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. పత్తిపల్లికి చెందిన కొడూరి సందీప్ ఇంట్లో సోదాలు చేయగా కిలో మాంసం ఫ్రిజ్‌లో దొరికిందని తెలిపారు. సందీప్‌ను విచారించగా కాశిందేవిపేట జన్ను ప్రసాద్ వద్ద కొనుగోలు చేశానని తెలిపాడు. దీంతో ప్రసాద్‌ను అదపులోకి తీసుకొని విచారించగా గోవిందరావుపేట మండలం పెట్రోల్ బంక్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి అమ్ముతుండగా 3 కేజీలు కొనుగోలు చేశానని తెలిపారు. మాంసాన్ని కొదూరి సందీప్, రాంనగర్ గ్రామానికి చెందిన చెట్ల రఘుకు విక్రయించానని తెలుపగా రఘును అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన మాంసాన్ని హైదరాబాద్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపేందుకు భద్ర పరిచామని తెలిపారు. నిందితులపై వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ 1972 ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. దాడుల్లో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ యాకూబ్, బీట్ ఆఫీసర్ ఉస్మాన్ పాల్గొన్నారు.



నిందితులను చూపుతున్న రేంజ్ అధికారి శంకర్

వరంగల్‌లో దళిత బహుజన ఫ్రంట్ మహాసభలు

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్

హన్మకొండ : దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర 4వ మహాసభలను జూన్ 3, 4 తేదీల్లో రెండు రోజుల పాటు వరంగల్‌లో నిర్వహించనున్నట్లు ఆ ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ తెలిపారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర మహాసభల సన్నహక సమావేశం జరిగింది. సమావేశంలో శంకర్ మాట్లాడుతూ మహాసభల విజయవంతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రాతు రమేష్ కుమార్, ప్రజాసంఘాల నాయకులు పులి కల్పన, మన్నే బాబురావు, పుట్ట రవి, పోరిక ఈశ్వర్ సింగ్, సందీప్, రవిప్రసాద్, శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, బాబు, నర్సింగరావు, అశోక్, జగన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

ట్రాలీ ఆటోను ఢీకొట్టిన గ్రానైట్ లారీ

- అక్కడికక్కడే ఇద్దరు మృతి
- మృతులు ఖమ్మం జిల్లావాసులు

తొర్రూరు రూరల్ : ట్రాలీఆటోను గ్రానైట్ లారీ ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం నాంచారిమడూరు శివారులో వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా తిరుమలపాలెం మండలం జల్లిపల్లి గ్రామానికి చెందిన రైతు గుగులోతు వెంకన్న(45), తిరుమలపాలెం మండలం అజ్మీరాతండాకు చెందిన డ్రైవర్ బర్మావత్ రమేష్(29)కి చెందిన టాటాఏస్ ట్రాలీలో మామిడికాయలను వరంగల్ మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయించాడు. తిరిగి ఖమ్మంకు వెళ్తుండగా మార్గమధ్యలో తొర్రూరు మండలం నాంచారిమడూరు శివారులోకి వచ్చేసరికి ఖమ్మంనుంచి వరంగల్ వైపు వెళ్తున్న ఖమ్మం జిల్లాకు చెందిన గ్రానైట్ లారీ అతివేగంగా ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ట్రాలీఆటో ముందుభాగంలో కూర్చున్న వెంకన్న రోడ్డుపై పడడంతో తలకు తీవ్రగాయం కాగా అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటోను నడుపుతున్న డ్రైవర్ రమేష్ క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయి చనిపోయాడు. తలముందు భాగమంతా గుర్తుపట్టని విధంగా నుజ్జునుజ్జు అయ్యింది. సమాచారం తెలుసుకున్న ఎస్సైలు సతీష్, లింగారెడ్డి ఘటనస్థలానికి చేరుకొని జరిగిన ప్రమాదంపై ఆరా తీసి మృతుల వివరాలు సేకరించారు. అనంతరం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు.



డ్రైవర్ రమేష్, రైతు వెంకన్న మృతదేహాలు

ట్రాక్టర్ ఢీకొని బాలుడి మృతి



వర్షిత్‌కుమార్ (ఫైల్)

గూడూరు: సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు బాలలను మూలమలుపు వద్ద ట్రాక్టర్ ఢీకొనడంతో ఒక బాలుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో బాలుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని మట్టెవాడలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వాసం వర్షిత్‌కుమార్ (12), అతని మిత్రుడు అర్రెం నవదీప్‌తో కలిసి సైకిల్‌పై వెళ్తున్నారు. గ్రామంలో ఓ మూలమలుపు వద్ద వచ్చిన ట్రాక్టర్ ఢీకొనడంతో ఇద్దరు కిందపడ్డారు. ఇద్దరికి తీవ్రగాయాలనట్లు గుర్తించిన గ్రామస్తులు వెంటనే మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా వర్షిత్‌కుమార్ మృతి చెందాడు. నవదీప్‌కు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి తండ్రి సారంగపాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై దిలీప్ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు..

మొగుళ్లపల్లి : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని బంగ్లాపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎడాకుల ఓదెలు (55) తనకున్న వ్యవసాయ భూమిలో వరిపంట సాగు చేస్తున్నాడు. రోజుమాదిరిగానే పంటకు నీళ్లు పెట్టే ప్రయత్నంలో భాగంగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి షాక్‌తో మృతి చెందాడు. మధ్యాహ్నం అయినా ఇంటికి తన తండ్రి రావడం లేదని కొడుకు వెళ్లి చూడగా పొలంగట్లపై వెతకగా బావి సమీపంలో మృతదేహం కనిపించింది. వెంటనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కరెంటు నిలిపివేసి తండ్రి మృతి చెందినట్లు నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం అందించాడు. మృతుడి భార్య ఆగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జాడి శ్రీధర్ తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎంపీపీ యారా సుజాత సంజీవరెడ్డి చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మృతుని కుటుంబాన్ని పరామర్శించింది.



ఓదెలు మృతదేహం

ప్రమాదవశాత్తు కిందపడి రైల్వే ఉద్యోగి మృతి




సత్యనారాయణ(ఫైల్)

కురవి: మద్యం మత్తులో ప్రమాదవశాత్తు రైల్వే క్వార్టర్స్ గదిలోని గోడకు తగిలి కిందపడిపోవడంతో రైల్వే ట్రాక్‌మెన్ పెండ్యాల సత్యనారాయణ(47) మృతి చెందిన సంఘటన మండలంలోని రాజోలు శివారు గుండ్రాతిమడుగు(స్టేషన్‌లో సోమవారం వెలుగుచూసింది. ఎస్సై బి.రామునాయక్ కథనం ప్రకారం.. యాదాద్రి భువనగిరికి చెందిన సత్యనారాయణ గుండ్రాతిమడుగు(స్టేషన్) రైల్వే స్టేషన్ పరిధిలో 2013 నుంచి ట్రాక్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్టేషన్ సమీపంలోని రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. అప్పుడప్పుడు భువనగిరిలోని భార్య పిల్లల వద్దకు వెళ్లి వస్తుంటాడు. సత్యనారాయణ కొంతకాలంగా మద్యం సేవిస్తూ ఉన్నట్లు ఎస్సై రాము వివరించారు. ఆదివారం సాయంత్రం మద్యం మత్తులో తూలూతూ ఇంట్లోకి వెళ్లగా ప్రమాదవశాత్తు గోడకు తగలడంతో తలకు తీవ్రగాయమైంది. సోమవారం ఉదయం సత్యనారాయణ విధులకు రాలేదని ఆయనతో పనిచేసే తోటి ఉద్యోగులు మారుతీ శ్రీనివాస్, అంజారీ రాంబాబులు గది వద్దకు వెళ్లి చూసే సరికి రక్తంమడుగులో ఉన్నట్లు గుర్తించారు. మృతదేహం పక్కనే మద్యం ఉన్న గ్లాసు కిందపడిపోయి ఉంది. వారు వెంటనే సత్యనారాయణ భార్యకు సమాచారం అందించారు. భార్య సత్యలక్ష్మీ, పిల్లలను తీసుకుని గుండ్రాతిమడుగు(స్టేషన్)కు వచ్చింది. భార్య పెండ్యాల సత్యలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. శవ పంచనామా చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందచేసినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడున్నారు. మృతుడి కుటుంబానికి మహబూబాబాద్ సెక్షన్ ఇంజనీర్ రాజమౌళి చేతుల మీదుగా రూ.25వేలు దహనసంస్కారాలకు అందజేశారు. బాధిత కుటుంబాన్ని వరంగల్ సెక్షన్ మజ్దూర్ యూనియన్ కార్యదర్శి ఆవుల యుగేంధర్, వైస్ చైర్మన్ బాబురావు పరామర్శించారు.

ఫోర్జరీ సంతకాలతో ష్యూరిటీ పత్రాలు తయారు

- నిందితుల అరెస్టు

వరంగల్ క్రైం : ఫోర్జరీ సంతకాలతో ష్యూరిటీ పత్రాలను తయారు చేసి వివిధ న్యాయస్థానాల్లో నిందితులు బెయిల్‌పై రావటానికి సహకరిస్తున్న ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు ఈస్ట్‌జోన్ డీసీపీ కరుణాకర్ తెలిపారు. కోర్టులో బెయిల్, పూచీకత్తు కోసం కావల్సిన పత్రాలను ఫోర్జరీ చేస్తున్న ముగ్గురిని పర్వతగిరి, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు డీసీపీ తెలిపారు. నిందితులు ఐనవోలు మండలం పంథిని గ్రామానికి చెందిన ఉడతల రవీందర్, సంగెం మండలం సోమ్లతండాకు చెందిన బానోతు వెంకన్న, బానోతు నరసింహుల నుంచి వివిధ జీపీలకు చెందిన స్టాంపులు, అధార్‌కార్డులు మూడు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్రవాహనం, రూ.3 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు రవీందర్ వివిధ కేసుల్లో జైల్లో ఉన్నవారికి బెయిల్ ఇచ్చేందుకు అవసరమైన పత్రాలు, ఇచ్చేందుకు సంగెం మండలంలోని సోమ్లాతండా, పర్వతగిరి మండలంలోని ముడెత్తల తండా, ఏనుగల్, చౌటప్పల్ గ్రామాల్లో సుమారు మందికి పైగా సంప్రదించేవాడని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ విభాగానికి చెందిన రెండు రౌండ్ రబ్బర్ స్టాంపులు పంచాయతీ కార్యదర్శి పేరుమీదుగా హైదరాబాద్‌లో తయారు చేయించి, ఇంటిపన్నుకు సంబంధించిన పత్రాలను సృష్టించి, పూచీకత్తు పడే వ్యక్తులను న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చేవాడని తెలిపారు. సోమవారం పర్వతగిరి పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఏనుగల్లు ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా నిందితుడు రవీందర్ దగ్గర పంచాయతీ కార్యదర్శి, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన స్టాంపులు, ఇంటిపన్ను రశీదులు అనధికారికంగా దొరకడంతో అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించినట్లు డీసీపీ తెలిపారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న మరో ఇద్దరి వివరాలను చెప్పడంతో ముగ్గురిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో 48 మందిని ష్యూరిటీదారులు గుర్తించినట్లు తెలిపారు. వీరు 29 కోర్టుల్లో 691 కేసుల్లో ష్యూరిటీ వ్యవహరించినట్లు పేర్కొన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచిన టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ కొమ్మురి శ్రీనివాస్‌రావు, పర్వతగిరి ఎస్సై దేవేందర్, టాస్క్‌ఫోర్స్ ఎస్సైలు లవన్‌కుమార్, ఏఏవో సల్మాన్‌పాషా, హెడ్ కానిస్టేబుల్ అశోక్, స్వర్ణలత, కానిస్టేబుళ్లు శ్రవన్‌కుమార్, నాగరాజు, సురేష్, కరుణాకర్, రాజేందర్, శ్యామ్, ప్రభాకర్, దయాసాగర్, మహబుబ్‌పాషాలను డీసీపీ అభినందించారు.



నిందితుల అరెస్టు చూపుతున్న డీసీపీ కరుణాకర్